
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024



లొత్తూరులో కొండలు కరిగి మేటలు వేసిన వరి పంట (ఫైల్)..

మహేంద్రగిరులకు ముప్పు!

తూర్పు కనుమల్లో అందమైన ప్రాంతం మహేంద్రగిరులు. ఈ పర్వతాలకు ఆనుకొని ఉన్న లొత్తూరు పంచాయతీలో 2018 అక్టోబరు 11న సంభవించిన తితలీ తుఫాన్ ధాటికి కొండలు సైతం కరిగి గ్రామాల మీదకు రాళ్లు రావడంతో గిరిజనులు బిక్కుబిక్కు మంటూ గడిపారు. తుఫాన్ ప్రభావంతో సర్వం కోల్పోయి రోడ్డున పడగా, పంట పొలాల్లో కొండల నుంచి వచ్చిన జలపాతాల ధాటికి ఇసుక మేట వేయడంతో భారీగా ఆస్తినష్టం జరిగింది. సంప్రదాయ పంటలు సైతం కనుమరుగు కాగా పచ్చనిచెట్లు కూడా నాశనమయ్యాయి. దీంతో లొత్తూరు పంచాయతీ మొత్తం తితలీ దెబ్బకు అతలాకుతలమైంది. ఇప్పటికైనా మేల్కొకపోతే మహేంద్రగిరులకు తుఫాన్ల సమయంలో ముప్పు తప్పదని.. ఇటీవల కేరళలో వయనాడు మాదిరి.. పరిస్థితి ఎదురుకానుందని పర్యావేరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

- పెదపలియా వద్ద వరహాలుగెడ్డ దుస్థితి ఇది. తితలీ తుఫాన్ సమయంలో పెదపలియా వద్ద కొండలు సైతం కరిగి గ్రామం మీదకు రావడంతో గిరిజనులు భయాందోళన చెందారు. తుఫాన్ దెబ్బకు గ్రామంలో 20కుపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇక్కడ నీరుపారే వరహాలగెడ్డ స్వరూపమే మారిపోయింది. 20 అడుగుల వెడల్పుతో ఉండే గెడ్డ ప్రస్తుతం 500మీటర్లకు పైగా పెరిగింది. తుఫాన్ బీభత్సాన్ని తాము కళ్లారా చూశామని.. ఇప్పటికీ ఆ భయం వెంటాడుతోందని గిరిజనులు చెబుతున్నారు.



- తితలీ తుఫాన్ నుంచే ప్రకృతి విధ్వంసానికి నాంది
- మరో వయనాడ్ కానుందా? అనే సందేహాలు
- ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న గిరిజన పంచాయతీలు

పలాస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి)

కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో ఇటీవల వరదల బీభత్సానికి కొండలు కరిగి ఊర్లకు ఊర్లే కనుమరుగయ్యాయి. వందలాది ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. కాగా 2018 అక్టోబరు 11న జిల్లాలో తితలీ తుఫాన్ కూడా ఇటువంటి విలయాన్నే సృష్టించింది. 200 కిలోమీటర్లకు పైగా వాయు వేగంతో గాలులు వీచాయి. కళ్లముందే కూలిపోతున్న జీడి, కొబ్బరి, భారీ వృక్షాలను చూసి ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. మహేంద్రగిరులకు ఆనుకుని ఉన్న పలాస మండలం లొత్తూరు పంచాయతీలో కొండచరియలు విరిగి గ్రామాల్లోకి వచ్చేశాయి. పెదపలియా, చినగంతారులో కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో గిరిజనులు భయాందోళన చెందారు. ప్రస్తుతం వయనాడ్ దుస్థితి చూస్తే అంతకన్నా ఘోరంగా లొత్తూరు ప్రాంతాలు మారనున్నాయా అన్న అనుమానాలు కలుగకమానదు.

- తూర్పుకనుముల్లో మహేంద్రగిరి పర్వతాలు 1501 మీటర్ల ఎత్తులో ఉంటాయి. వాటి కింద భాగంలో లొత్తూరు పంచాయతీ గ్రామాలు ఉన్నాయి. గత తితలీ తుపాను సమయంలో మహేంద్రగిరుల్లో (మిగతా 6వ పేజీలో...)



జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాట్లు

వీరులకు వందనం

- మావోయిస్టులతో పోరాడి..
- నక్సల్ తూటాలకు, కూంబింగ్‌లో మృత్యువాత
- నేడు జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం

6లో

మళ్లీ తుఫాన్

- బంగాళాఖాతంలో వాయుగుండం..
- ఈనెల 24, 25న అతి భారీ వర్షాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దంటూ హెచ్చరిక

శ్రీకాకుళం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మళ్లీ తుఫాన్ గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి.. తుఫాన్‌గా మారనుంది. ఒడిశాతోపాటు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మధ్యలో తుఫాన్ తీరం దాటనుంది. ఈ ప్రభావంతో అతిభారీ వర్షాలు కురవనున్నాయి. జిల్లాపై ప్రభావం చూపనుందని 'ఇండియా మెటిరాలాజికల్ డిపార్ట్‌మెంట్ నుంచి హెచ్చరిక జారీ అయింది. తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఈదురుగాలులు బలంగా వీయనున్నాయి. దశాబ్ధాల తరబడి అక్టోబరులో వాటిల్లే తుఫాన్‌కు జిల్లా వాసులు భయపడుతూనే ఉంటున్నారు. తాజాగా మళ్లీ తుఫాన్ గండంతో భీతిల్లుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ఆదేశించారు.

- అధికారులు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అన్ని మండలాల అధికారులు, తుఫాన్ ప్రత్యేకాధికారులతో కలెక్టర్ స్వప్నిల్ (మిగతా 6వ పేజీలో...)

న్యూస్ బాక్స్

ఇద్దరి బాలికలపై అత్యాచారం?

- వీడియో తీసి మరొకరి వికృతానందం
- విచారణ చేస్తున్న పోలీసులు

పలాస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలపై మరో ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని మరో వ్యక్తి వీడియోలు తీసి వికృతానందాన్ని పొందడం చర్చనీయాంశమవుతోంది. శనివారంరాత్రి ఈ ఘటన జరగ్గా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పరువు దృష్ట్యా ఈ తతంగంపై బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. అయినప్పటికీ సమాచారం తెలుసుకున్న పోలీసులు తక్షణమే స్పందించి ముగ్గురు అనుమానిత బాలుర్లను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి చెందిన ముగ్గురు బాలికలు (ఇంటర్ చదువుతున్నారు), ముగ్గురు బాలురు(డిగ్రీ) కలిసి జగనన్న కాలనీ సమీపంలో నిర్మానుష్యమైన ప్రాంతానికి శనివారం రాత్రి వెళ్లారు. అక్కడ బాలికలపై బాలురు వికృతచేష్టలు చేశా రు. ఓ బాలుడు వాటిని వీడియోలో చిత్రీకరించి వికృతానందాన్ని పొందినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఆదివారం బయట పడడంతో.. (మిగతా 6వ పేజీలో...)

ఇంకా పాత ధరలే..



- జిల్లాలో తెరచుకున్న ప్రైవేటు మద్యం దుకాణాలు
- రూ.99 కోసం మందుబాబుల ఎదురుచూపులు
- రెండు రోజుల్లో కొత్తవి అందుబాటులోకి..

శ్రీకాకుళం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 'జే' బ్రాండ్లకు కాలం చెల్లిందని.. నాణ్యమైన మద్యం లభిస్తుందని మందుబాబులు ఆశపడ్డారు. గత నాలుగు రోజుల నుంచి కొత్త వైన్‌షాపులు ఏర్పాటయ్యాయి. జిల్లాలో మొత్తం 158 మద్యం దుకాణాలకుగాను ప్రస్తుతం 156 దుకాణాలు ప్రారంభించేశారు. కాగా.. మద్యం దుకాణాల్లో పాత ధరలకే విక్రయిస్తున్నారని, ప్రభుత్వం మార్పు చేసిన ధరలు ఇంకా అందుబాటులోకి రాలేదంటూ అంతటా మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రూ. 99కే షాట్‌లను దింపింది. అయితే ప్రస్తుతం జిల్లాలో ఇవి అందుబాటులో లేవు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే... ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడలేదని.. రెండు మూడురోజుల్లో వస్తాయని వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

- 'గుడ్ విల్' విక్రయాలు పూర్తి...

సిండికేట్‌గా దరఖాస్తులు వేసిన వ్యాపారులు... 'గుడ్‌విల్' పేరిట విక్రయాలను పూర్తిచేసుకున్నారు. అన్ని మండలాల్లోనూ పది మంది నుంచి ఇరవై మందిగా సిండికేట్ అయి.. అన్నిచోట్లా దుకాణాలను కొనుగోలు చేశారు. కనిష్ఠంగా దుకాణానికి రూ.30 లక్షలు ధర నిర్ణయించి.. పెద్దసెంటర్లు అయిన శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాస, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో రూ.కోట్ల వరకు ధర చెల్లించి వైన్‌షాపు పొందిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసుకున్నారు. దుకాణాల పరిధిలో బెల్ట్ దుకాణాలు ఏయే ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలన్నది సమాలోచన చేస్తున్నారు. ప్రస్తుతం ఓ రెండు నెలలు.. ఏవిధమైన అధిక ఆదాయం కోసం వెతికి ఇబ్బందులు తెచ్చుకోకుండా.. అధికారులకు కూడా 'మామ్మూళ్లు' అలవాటు అయ్యాక వ్యాపారం విస్తరించుకుందామని భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

- రూ. 39.37 కోట్లు మేర విక్రయాలు..

ఈనెల 16 నుంచి జిల్లాఅంతటా మద్యం దుకాణాలు ప్రైవేటు పరమయ్యాయి. శనివారం నాటికి రూ.39.37 కోట్లు మద్యం విక్రయాలు జరిగాయి. పాత ధరలే ఇంకా ఉండటంతో అసంతృప్తిగా ఉన్నప్పటికీ.. వాటినే మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు మాత్రం.. మరో రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం విధించిన ధరలు అమల్లోకి తెస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇందులో షాట్, కేరళ, సుమో... వంటి మద్యం రూ.99కే విక్రయించనున్నారు. ఇతర బ్రాండెడ్ మద్యం కూడా అప్పటినుంచే లభించనున్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, హాజరైన కోర్టు కానిస్టేబుళ్లు

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం

- శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శిక్షలు శాతం పెరిగేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులే కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. కోర్టు విధుల్లో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా అంకితభావంతో పని చేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా కోర్టు కానిస్టేబుల్, కోర్టు సమన్వయ సిబ్బందితో కోర్టు కేసుల విచారణ, సమన్లు, వారెంట్‌ల అమలు, సాక్ష్యులను కోర్టులో హాజరుపరచడం, కేసు అభియోగ పత్రాలు దాఖలు, వివిధ దశల్లో ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలపై ఎస్పీ సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. 'పోలీసుస్టేషన్లు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ అంకితభావంతో పనిచేస్తూ శిక్షల శాతం పెంచేలా శ్రమించాలి. నాన్‌బెయిలబుల్ వారంట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కేసు విచారణ సమయంలో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వద్ద ప్రవేశ పెట్టి బ్రీఫింగ్ ఇవ్వాలి. పెండింగ్ కేసులు లేకుండా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానటరింగ్ సిస్టం వారు చర్యలు తీసుకోవాలి. దర్యాప్తు అధికారులు కోర్టుకి హాజరయ్యేలా చూసుకోవాలి' అని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న టెట్

ఎచ్చెర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) సోమవారంతో ముగియనుంది. జిల్లాలో శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. ఆదివారం రెండు షిప్ట్‌ల్లో కలిపి శ్రీ శివానీలో 340 మంది అభ్యర్థులకు 296 మంది, శ్రీ వెంకటేశ్వరలో 201 మందికి 170 మంది హాజరయ్యారు.





భవ్య, రామారావు(ఫైల్)

పెళ్లికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థినితోపాటు మరొకరు మృతి
- ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- పోలాకి మండలం జిల్లేడివలసలో విషాదఛాయలు

నరసన్నపేట, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. రేపటి నుంచి కాలేజీలో పరీక్షలు. నేను పెళ్లికి రాత్రి వరకూ ఉండలేను. పరీక్షలు కదా.. చదువుకోవాలి. మన ఊరివారు ఎవరైనా ఉంటే.. వారితో ఇంటికెళ్లి పోతాను' అని ఆ విద్యార్థి కన్నతల్లికి చెప్పింది. దీంతో పెళ్లికి వచ్చిన అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆ విద్యార్థిని ఇంటికి బయలుదేరింది. జాతీయ రహదారిపై పయనిస్తుండగా.. లారీ రూపంలో మృత్యువు కబళించింది. వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి అతివేగంతో లారీ ఢీకొని.. ఈడ్చుకెళ్లిపోయింది. దీంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతిచెందింది. ఆ వ్యక్తి కొన ఊపిరితో ఉండగా స్థానికులు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. నరసన్నపేటలోని సత్యవరం జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో.. పోలాకి మండలం జిల్లేడివలసకు చెందిన నక్క రామారావు(48), ఇంటర్ విద్యార్థిని తియ్యాల భవ్య(16) విషాదాంతమిది. వీరిద్దరూ శ్రీకాకుళం మండలం పరదేశిపాలెంలో శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. రహదారిపై తండ్రి మృతదేహాన్ని చూసి.. 'నాన్న లెగు.. అమ్మ నీ కోసం చూస్తోంది' అంటూ రామారావు కుమారుడు సంతోష్ రోదన.. చూపరులకు కన్నీరు తెప్పించింది.



రామారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు సంతోష్

8లో



యువతా మేలుకో.. అవకాశం పుచ్చుకో!

- పీఎం ఇంటర్న్‌షిప్.. యువతకు ఉపాధి బాట
- బహుళ జాతి కంపెనీల్లో వృత్తి నైపుణ్యాల శిక్షణ
- 25 వరకు నమోదుకు గడువు

6లో

వీరులకు వందనం

- మావోయిస్టులతో పోరాడి..
- నక్సల్ తూటాలకు, కూంబింగ్‌లో మృత్యువాత

నేడు జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి)

శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర కీలకం.. ప్రజల ధన, ప్రాణ, రక్షణ వారి ప్రధాన విధి.. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ఆపద కలిగినా తక్షణం స్పందించాల్సిన విభాగం వారిది.. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులను కాపాడడంలో వారి పాత్ర ప్రధానం.. చోరీలను ఛేదించడమైనా, ప్రమాదా లను నివారించడంలోనైనా.. ప్రజాప్రతినిధులకు భద్రత కల్పించడంలో నైనా, అత్యవసర సమయా ల్లోనైనా వారి సేవలు కావాల్సిందే.. సంఘ విద్రోహ శక్తులను అదుపు చేస్తూ మావోయి స్టుల కదలికలను కనిపెడుతూ.. నిత్యం సవాళ్లను ఎదుర్కొంటున్న పోలీసు విభా గంలో వీరోచితంగా పోరాడి చిరస్మ రణీయులైన వారు ఎందరో.. ఎందరెందరో.. వారి త్యాగాలు నాటికి, ఏనాటికీ మరువలేనివే.. చిరస్మరణీయమైనవే..

1959 అక్టోబరు 21న భారత్-చైనా మధ్య జరిగిన యుద్ధంలో దేశానికి చెందిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను శత్రు దేశానికి చెందిన వారు హతమార్చారు. నాటి నుంచి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లను స్మరిస్తూ దేశ వ్యాప్తంగా జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నా యి. ఇదే కోవలో నక్సల్స్‌తో వీరోచితంగా పోరాడి అమరులైన జిల్లాకు చెందిన పలువురు పోలీసులను ఒకసారి స్మరించుకోవడం.. వారి త్యాగాలను మననం చేసుకోవడం ప్రతి ఒక్కరి విధి.. బాధ్యత.




నక్సల్స్ ఎదురు కాల్పుల్లో బలై..

జిల్లా చరిత్రలో తొలిసారి 1992వ సంవత్సరం నక్సల్స్ దాడిలో బలైన వ్యక్తి ఎస్.బంగారు నాయుడు. విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందిన ఈయన నాడు కాశీబుగ్గ ఎస్ఐగా విధుల్లో ఉన్నారు. మందస మండలం రట్టి- భేతాళపురం గ్రామాల మధ్య ఉన్న కొండల్లో నక్సలైట్లు ఉన్నారనే సమాచారంతో వారిని పట్టుకునేందుకు సిబ్బందితో వెళ్లిన బంగారునాయుడు 1992 మార్చి 24న ఉద్దానం దళానికి చెందిన నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందారు. బంగారునాయుడు పోలీసు శాఖలో 1989 జనవరిలో ఎస్ఐగా చేరారు. జిల్లాలోని బారువ, కాశీబుగ్గ స్టేషన్లలో విధులు నిర్వహించి ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు.

రివాల్వర్‌తో వెనుక నుంచి కాల్చి..

సమాచార సేకరణలో ఆరితేరిన కానిస్టేబుల్ పి.కృష్ణమూర్తి 2000వ సంవత్సరంలో హరిపురంలో నక్సల్స్ రివాల్వర్‌తో వెనుక నుంచి కాల్చి చంపారు. సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి 1998లో కానిస్టేబుల్‌గా చేరారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న నక్సల్స్ కార్య కలాపాలను అడ్డుకోవడం, వారి సమాచారం సేకరించడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. దీనిని జీర్ణించుకోలేక.. మావోయిస్టుల కదలికలపై కూంబింగ్ నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని 2000 జూన్ 5న మందస మండలం హరిపురం కూడలిలో నక్సలైట్లు మాటువేసి కృష్ణమూర్తిని వెనుక నుంచి రివాల్వర్‌తో కాల్చి చంపేశారు. ఆయన భార్యకు జిల్లా పోలీసు కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా నియమించగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు.



గుడి వద్ద మాటువేసి..

పీపుల్స్‌వార్ నక్సలైట్ల కదలికలను పసిగట్టి వారి అకృత్యాలను నిరోధించడంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.నరేంద్రదాస్ కీలక పాత్ర పోషించారు. టెక్కలికి చెందిన నరేంద్రదాస్ 1976లో పోలీసు శాఖలో రూరల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా చేరి, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో సమర్థవంతమైన సేవలందించారు. నక్సలైట్ల సమాచార సేకరణలో నిష్ణాతుడైన నరేంద్రదాస్ వారి ఉద్యమాలను నీరు గార్చారు. దీంతో 1997 మార్చి 17న కాశీబుగ్గలో ఓ గుడి వద్ద ఆరుగురు నక్సల్స్ మాటువేసి జరిపిన కాల్పుల్లో నరేంద్రదాస్‌ను పొట్టన పెట్టుకున్నారు. ఈయన సేవలను గుర్తించి కుమారుడు మనుకొండ శ్రీనివాస్ నాయుడుకి పోలీసు శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు.





బందోబస్తుకు వెళ్లి.. వీరోచితంగా పోరాడి..

కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామానికి చెందిన అన్నెపు పాపారావు 1971లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ప్రజల ధన, ప్రాణ రక్షణ, నక్సలైట్ల ఆగడాలను అడ్డుకోవడంలో విశేష పాత్ర పోషించారు. ధైర్యసాహసాలకు మారుపేరుగా ఈయనకు పోలీసు శాఖలో గుర్తింపు ఉంది. పలాస మండలం నీలిభద్రలో ఒక వ్యక్తిని చంపేందుకు నక్సలైట్లు ప్రణాళిక సిద్ధం చేశారు. అతన్ని రక్షించేందుకు ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పటికి వజ్రపుకొత్తూరులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాపారావును పోలీసు పికెటింగ్‌కి ఇన్‌చార్జిగా నియమించారు. 1997 జూలై 17న అర్ధరాత్రి వేళ ఆ వ్యక్తి ఇంటిపై నక్సల్స్ దాడి చేయడంతో పాపా రావు ఎదిరించి వీరోచితంగా పోరాడారు. చివరకు నక్సల్స్ తూటాలకు నెలకొరిగారు. ఆయన సేవలకు గుర్తింపుగా కుమారుడు అన్నెపు రమేష్‌కు సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రాగా ఎస్పీ సీసీగా సేవలందించి ప్రస్తుతం విజిలెన్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.



మందుపాతరకు బలి...

పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన నిరుపేద రైతు కూలీ మజ్జి చిన్నవోడు పెద్ద కుమారుడు మజ్జి వెంకటరమణ 1998లో తన 22 ఏటనే కానిస్టేబుల్‌గా చేరారు. స్పెషల్ పార్టీలో చురుగ్గా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల వద్ద గుర్తింపుపొందారు. భామిని మండలం నులక జోడులో అర్ధరాత్రి సుమారు 200 మంది ఆదివాసీ గిరిజనులతో కలిసి నక్సలైట్లు రైస్ మిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లిపోయారు. కూంబింగ్‌కు వెళ్లిన వెంకటరమణ 2001 అక్టోబరు 27న నడిమిగూడ వద్ద నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి మృత్యువాత పడ్డారు. ఆయన సేవలను గుర్తించి ఆయన చెల్లి త్రివేణికి అటెండర్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.



కొడుకును తోడుగా ఉంచండి..

మజ్జి వెంకటరమణ తల్లిదండ్రులు నరసమ్మ, చిన్నవోడు. వీరికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు వెంకటరమణ నక్సల్స్ దాడిలో మృతి చెందగా.. రెండో కుమారుడు ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరగ్గా వెంకటరమణ మృతి చెందడంతో ఆయన సోదరి త్రివేణికి ఉద్యోగం ఇచ్చారు. ఆమెతో పాటు చిన్న కొడుకు తల్లిదండ్రుల పోషణ బాధ్యతలను తీసుకున్నారు. అయితే వృత్తిరీత్యా వెంకటరమణ తమ్ముడు విశాఖ జిల్లా ఏజెన్సీలో విధులు నిర్వహించడం, కుమార్తెలు అత్తవారింట్లో ఉన్నారు. 2022 డిసెంబరులో తల్లి నరసమ్మ చనిపోవడంతో తండ్రికి తోడు లేకుండా పోయింది. అయితే తల్లిదండ్రుల ఆలనా పాలన కోసం చిన్న కుమారుడు తనకు తోడుగా ఉండేలా.. ఆయనను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేయాలని చిన్నవోడు నాటి ఎస్పీ త్రివిక్రమవర్మ నుంచి అందరి అధికారులకు మొర పెట్టుకున్నా నేటికీ ఫలితం కనిపించలేదు. దీనిపై అసంతృప్తితో చిన్నవోడు ఏటా జరిగే అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి రావడం మానేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి.. ముసలితనంలో తన రెండో కుమారుడిని తనకు తోడుగా ఉంచాలని ఆయన వేడుకుంటున్నారు.

-వెంకటరమణ తండ్రి చిన్నవోడు అభ్యర్థన



తితలీ తుఫాను సమయంలో సర్వం కోల్పోయిన చినగంతారు గ్రామం (ఫైల్)...

మళ్లీ తుఫాన్

(ఐదో పేజీ తరువాయి) దినకర్ పుండ్కర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 'అన్ని మండలాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాల్సిందే. ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి. తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి. సముద్రంలోకి చేపలవేటకు వెళ్లే మత్స్యకారులు ఒడ్డుకు చేరుకోవాలి. తీర ప్రాంతాల్లోనూ.. నదీ పరివాహక ప్రజలు 24, 25 తేదీల్లో బయటకు వెళ్లకూడదు. వీలైనంతవరకు సురక్షిత ప్రాంతాల్లోనూ.. తుఫాన్ రక్షిత భవనాల్లో ఉండాలి. ఆర్అండ్‌బీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్ అధికారులు సిద్ధంగా ఉండాలి. రోడ్లపై చెట్లు కూలినా వెంటనే తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను అందుబాటులో ఉంచాలి. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు తుఫాన్ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి. మండల స్థాయిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయాలి' అని కలెక్టర్ ఆదేశించారు. 'ప్రజల అవసరం కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08942-240557 నంబర్‌ను వినియోగించుకోవాలి. చెరువులను, కాలువ గట్లను ముందుగా పరిశీలించి చర్యలు చేపట్టాలి. లోతట్టు ప్రాంతాలు జలమయమైతే మోటార్లతో నీటిని తోడించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలి" అని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఇద్దరి బాలికలపై అత్యాచారం?

(ఐదో పేజీ తరువాయి) విషయం పోలీసుల వరకూ వెళ్లింది. అంతా మైనర్లు కావడం.. పరువు పోతుందనే ఉద్దేశంతో బాధిత కుటుంబాలు కూడా పోలీసులకు ఎటువంటి ఫిర్యాదులు చేయలేదు. కాగా.. సమాచారం తెలుసుకుని కాశీబుగ్గ పోలీసులు అప్రమత్తమయ్యారు. ముగ్గురు బాలుర్లను విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సీఐ డి.మోహనరావును వివరణ కోరగా.. తమకూ ఈ సంఘటన సూచనప్రాయంగా తెలిసిందన్నారు. అనుమానిత బాలుర్లను ప్రశ్నిస్తున్నామని తెలిపారు. మొత్తం సంఘటన అంతా బాలబాలికల చుట్టూ ఉండడంతో చైల్డ్‌లైన్ సంస్థకు ఫిర్యాదు చేశామన్నారు. వారు వాస్తవాలు పరిశీలిస్తారని, వారిచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాల నుంచి ఇప్పటివరకూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మహేంద్రగిరులకు ముప్పు!

(ఐదో పేజీ తరువాయి) ఉన్న ప్రాంతం భారీగాలులు, వారం రోజులుగా కురిసిన తుఫాను ధాటికి కొండ కరిగి లొత్తూరు గిరిజన పంచాయతీలపై పడింది. మహేంద్రగిరుల గుండా వరహాలుగెడ్డ నీరు ప్రవహిస్తుంటుంది. 100 అడుగులు ఉన్న ఈ గెడ్డ తుఫాను ప్రభావంతో 500 అడుగుల వరకూ పెరిగి భారీ ప్రవాహంతోపాటు కొండపై ఉన్న బండలు, మట్టి తరలివచ్చి కిలోమీటరు మేర మేటలు వేసింది. మరో అర కిలోమీటరు ఈ ప్రవాహం వెళ్లి ఉంటే లొత్తూరు గ్రామానికి తీవ్ర నష్టం కలిగి ఉండేది. ప్రకృతి కరుణించి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే అప్పటికే జరగని నష్టం జరిగిపోయింది. 20 ఎకరాలకు పైగా మట్టి, రాళ్ల మేటలు వేయగా కల్వర్టులు సైతం కొట్టుకుపోయాయి. తుఫాను వెళ్లిన వారం తరువాత కానీ అక్కడి నష్టం గురించి బాహ్య ప్రపంచానికి తెలియరాలేదు. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' అతి కష్టంపై అక్కడకు వెళ్లి పరిస్థితిని అధికారులకు చేరవేసింది. ప్రస్తుతం లొత్తూరు గిరిజన పంచాయతీ గ్రామాల్లో సాధారణ పరిస్థితి నెలకొంది. ఇసుక మేటలు, రాళ్ల దిబ్బలుగా మారిన ప్రాంతాల్లో చదునుచేసి పంటలు పండిస్తున్నారు. అయితే తుఫాన్ నీడలు మాత్రం గిరిజనులను వెంటాడుతూనే ఉన్నాయి. కొండలు కరిగిపోతుండడం వల్ల వయనాడ్ వలె ఇక్కడ కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- భారీ కొండల మధ్యలో చిన్న రహదారి, దాని పక్కన వరహాలుగెడ్డ సెలయేరు ప్రవహిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఆయా గ్రామాల ప్రజలకు ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేయాల్సి ఉంది. గిరిజనులకు కొండల సమూహంపై అవగాహన లేకపోవడం వల్ల ఇళ్ల నిర్మాణానికి రాళ్ల తీయడం, చెట్లు నరికి పోడు వ్యవసాయం చేయడం వల్ల భారీ ముంపు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మరో వయనాడ్ కాకుండా గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొండలు మనకు అండ..



మొక్కల వేర్లు, దాని నుంచి పెరిగే మూలకేశాలు మట్టిరేణువు లను బంధించి కొండ లపై మృత్తిక క్షమక్ష యం జరగకుండా ఆపుతాయి. అందుకే అడవుల్లో చెట్లు నరికి వేయడం, పోడు వ్యవసాయం వంటి పనులు చేయకూడదు. అలా చేయడం వల్లే ఇటువంటి విలయాలు జరుగుతుంటాయి. వర్షాలకు మట్టి, కొండచరియలు విరిగిపడి భారీ నష్టాన్ని కలుగజేస్తాయి. కొండ దిగువ ఉన్న ప్రాంతాల్లో కంకర, రాళ్ల తవ్వి తీయడం వల్ల ఎత్తయిన కొండలకు పునాదులు లాంటివి లేకపోతే ఇళ్లు లాంటి కొండ ఎక్కడ నిలుస్తుంది. తుఫానుల నుంచి సహజసిద్ధంగా ప్రహరీలుగా నిలిచే కొండలు లేకపోతే విపత్తులు సహజమే. దీన్ని అరికట్టడానికి ప్రభుత్వాలు ముందస్తుగా చొరవ తీసుకొని విలయాలు ఆపాల్సి ఉంది.

-కొయ్యిల శ్రీనివాసరావు, పర్యావరణమిత్ర పురస్కార గ్రహీత, సైన్స్ ఉపాధ్యాయుడు, బ్రాహ్మణతర్లా

రక్షణ చర్యలు చేపట్టాలి..



లొత్తూరు పంచాయతీ హొల్డిగామ్, పెద్దగంతారు, చింతువీధి, డెర్లి వంటి గ్రామాలు మహేంద్రగిరి పర్వతాల దిగువన ఉన్నాయి. తుఫానుల కారణంగా కొండచరియ లు, రాళ్లు, బురదతో ఉన్న వరదనీరు గ్రామాల్లోకి వస్తున్నాయి. వర్షం పడితే.. బిక్కుబిక్కుమంటు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. పంటలు సైతం మేటలు వేసి నాశనం అవుతున్నాయి. ముందుగా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అటువంటి గ్రామాలను గుర్తించి చుట్టు రక్షణ గోడలు నిర్మించాలి. కొన్ని చోట్ల కందకాలు తవ్వి రక్షణ కల్పించాలి.

-వంకల మాధవరావు, పర్యావరణ ఉద్యమకారుడు, అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ముందుచూపు ఉండాలి..



వయనాడ్‌తో పాటు ఒడిశాలో గుమ్మ బ్లాక్‌లో కొండలు కరిగి గ్రామాల్లోకి నీరు రావడం వల్ల అనేక గ్రామాలు ఇప్పటికీ కనిపించడం లేదు. వందలాది ప్రాణాలు పోయాయి. దీని నుంచి ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠాలు నేర్వలేకపోవడం దురదృష్టకరం. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ముందుచూపుతో ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలి.

-వాబ యోగి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

యువతా మేలుకో.. అవకాశం పుచ్చుకో!



- పీఎం ఇంటర్న్‌షిప్.. యువతకు ఉపాధి బాట
- బహుళ జాతి కంపెనీల్లో వృత్తి నైపుణ్యాల శిక్షణ
- ఈనెల 25 వరకు నమోదుకు గడువు
- శిక్షణలో ఏడాదికి రూ.66 వేలు, బీమా సదుపాయం

నరసన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్రం అవకా శం కల్పిస్తోంది. తద్వారా మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందొచ్చు. నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తెచ్చింది. బహుళజాతీయ సంస్థల్లో శిక్షణ ఇప్పించి నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈనెల 12 నుంచి పేర్లు నమోదు ప్రక్రియ చేపట్టింది. ఉత్తరాంధ్రలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం, డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలలు, ఐటీఐలు, కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్, డిప్లొమా చదివే 30 వేలకు పైగా విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశం.

అర్హులు ఎవరంటే..

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే వారు పదోతరగతి, ఇంటర్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీటీఏ పూర్తి చేసి ఉండాలి. ఐటీఐ, డిప్లొమా సైతం పూర్తి చేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చును. ఈ పథకానికి 21 నుంచి 24 ఏళ్లలోపు నిరుద్యోగ యువకుల దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎం.ఇంటర్న్‌షిప్. ఎంసీఏ.జీవోవి.ఇన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబరు, బయోడేటాతో రిజస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరీ తదితర వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నెంబరు, ఈ- మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాలి. ఎటువంటి రిజస్ట్రేషన్ ఫీజు లేదు.

ఏఏ పత్రాలు కావాలంటే...

ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. ఐదు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఆప్షన్స్ ఉంటాయి. ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఎంపికైతే మీ ఈ-మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుంది. అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడు చేసుకునే వీలు కూడా ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఎంపికైన వారికి.. వారు ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలను నేర్పిస్తారు. అర్హత సాధించిన వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, పీఎం సురక్ష బీమా కవరేజ్ కూడా లభించే అవకాశం ఉంది.

వేటిని అందిస్తారంటే..

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, పార్మాస్యూటికల్, ఏవియేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్, తదితర రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు. ఎంపికైన వారికి ఏడాది పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు వన్‌టైం గ్రాంటు కింద రూ.6వేలతో పాటు ప్రతినెలా ప్రభుత్వం రూ.4,500లు, కంపెనీ రూ.500 చొప్పున డీబీటీ ద్వారా క్రెడిట్ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

శిక్షణ ఎక్కడంటే..

విశాఖ, విజయనగరం, పైడిభీమవరం పరిసరాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, హెచ్‌పీసీఎల్, బెల్, ప్రైవేటు సంస్థలు రెడ్డీస్, అరబిందో, దివీస్ ల్యాబొరేటరీస్, టెక్ మహీంద్ర తదితర సంస్థల్లో శిక్షణకు అవకాశం ఉంది.

- జిల్లాలో ఏడాదికి దాదాపు 30 వేల మంది ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బిఫార్మశీలు పూర్తి చేస్తున్నారు. చాలా మంది సరైన నైపుణ్యాలు లేకపోవడంతో ప్రముఖ సంస్థల్లో అవకాశాలు కోల్పోతున్నారు. వారికి పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

వీరు అనర్హులు..

ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన వారు. ఎంబీఏ, ఎంసీఏ, సీఏ, ఎంబీబీఎస్ తదితర ఉన్నత డిగ్రీలు చదివినవారు, 2023-24 విద్యాసంవత్సరంలో కుటుంబంలో ఏ ఒక్కరి ఆదాయం రూ.8లక్షలు దాటిన వారు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు.

- దరఖాస్తు ప్రారంభం అక్టోబరు 12న
- చివర తేది: ఈనెల 25వ తేది లోపు
- దరఖాస్తు దారుల జాబితా విడుదల : ఈనెల 26వ తేది
- ఎంపిక ప్రక్రియ : ఈనెల 27 నుంచి నవంబరు 7 వరకు
- అభ్యర్థి అంగీకారానికి గడువు : నవంబరు 8 తేది నుండి 15 వ తేది వరకు
- ఇంటర్న్‌షిప్ ప్రారంభం: డిసెంబరు 2
- సందేహాల నివృత్తికి :హెల్ప్ లైన్ నెంబరు: 1800116090కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు.


యువతకు వరం..



కేంద్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంపుదించేందుకు తీసుకువచ్చిన పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ప్రాథమింగా యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈకార్యక్రమం ఎంతో దోహదపడుతుంది. జిల్లాలో యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని కళాశాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ఉపాధి కల్పనకు దోహదపడుతుంది.

-విద్యాసాగర్, ప్లేస్‌మెంట్ అధికారి, బీఆర్ఏయూ, శ్రీకాకుళం

సువర్ణ అవకాశం..



డిగ్రీలో బీఏ చదివే విద్యార్థులకు పీఎం ఇంటర్న్‌షిప్ చాలా ఉపయోగంగా ఉంటుంది. వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడం వలన యువతలో దాగి ఉన్న నైపుణ్యాలు బయటపడేందుకు దోహదపడతాయి. ముందుగా శిక్షణ ఇచ్చి తరువాత పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తే మరికొంత మంది యువతకు ఈ అవకాశం అందిపుచ్చుకునేందుకు అవకాశాలు ఇవ్వడం బాగుంది.

-చిగురపల్లి శ్రీకాంత్, డిగ్రీ లీవ్ విద్యార్థి, బోరుభద్ర

ఆడపిల్లలకు భరోసా..



ఆడపిల్లలు పీఎం ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాలు పెంపుదించుకునేందుకు దోహదపడుతుంది. నాన్ టెక్నికల్ చదివే విద్యార్థులకు ప్రయోజనం. స్థానికంగా ఉన్న బహుళజాతి కంపెనీల్లో ఆడపిల్లలకు ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఇవ్వాలి. ఇంటర్న్‌షిప్ పూర్తయిన వారికి ఉపాధి అవకాశాలతో ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం ఇవ్వాలి.

-కింజరాపు రేవతి, లీలివింగ్ డిగ్రీ విద్యార్థి, నిమ్మాడ

చిన్నారికి ఆర్థిక సాయం

కవిటి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జగతి పంచాయతీలోని బట్టివానిపాలెం గ్రామానికి చెందిన చీకటి మదన్ అనే బాలుడు రక్త సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న చింతామణి సీఫుడ్స్ యూనియన్ సభ్యులు ఆదివారం తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ముగిసిన నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సూత్రా ఫౌండేషన్ శ్రీ సుమిత్రా కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు ఆదివారం మూడో రోజు 'కెరటాలు' 'సప్తమ సూత్రం' రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. నాటకపోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీల్లో నిలిచిన వారికి ఉత్తమ నటీనటులకు, నగదు బహుమతులు, మెమొంటోలు అందజేసి సత్కరించారు.

రామనామ స్మరణతో ప్రశాంతత

సరుబుజ్జిలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీరామ చంద్రుని అడుగుజాడల్లో నడవడం ద్వారా మనశ్శాంతి ప్రశాంతత పొందవచ్చని రొట్టవలస శ్రీరామానందాశ్రమ వ్యవస్థాపక గురుస్వామి తొత్తడి వెంకటరమణ అన్నారు. ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన సత్సంగ కార్యక్రమంలో బొంగు జోగులాచార్యులు, కల్యాణం అప్పారావు, ఎ.అప్పలనాయుడు భక్తులకు హితోపదేశం చేశారు. రామనామ స్మరణను ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలన్నారు.

నిస్సహాయ స్థితి పిల్లలకు అండగా 'వాత్సల్య'

సరుబుజ్జిలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న నిస్సహాయ స్థితి పిల్లలకు మిషన్ వాత్సల్య ద్వారా ఆదుకోవడం జరుగుతుందని పీవో గీత తెలిపారు. 2024-25వ సంవత్సరానికి మిషన్ వాత్సల్య పథకంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు విద్యా వైద్య అభివృద్ధి కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందించే పథకమని తెలిపారు. ఈ నెల 24వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ కాగా.. మార్చి 2025 నాటికి 18 ఏళ్ల లోపు తల్లి, తండ్రి కోల్పోయిన పిల్లలు ఇతర కుటుంబాల్లో నివసిస్తున్న అనాథ పిల్లలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. కేన్సర్, ఎయిడ్స్ డయాలసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారి పిల్లలు కూడా అర్హులన్నారు.

తులసమ్మతల్లి సంబరం

ఇచ్ఛాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు. మట్టి బిందెలతో తీసుకొచ్చిన పానకాలు, పసుపు నీరుతో అమ్మవారిని చల్లదనం చేశారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా ఆదివారం బాలకృష్ణాపురం పంచాయతీలో రూ.28 లక్షలతో కేదారిపురం పంచాయతీలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. అలాగే మున్సిపాల్టీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి భూమి పూజ చేశారు. కూటమి నాయకులు దాసరి రాజు, బుద్దా నిర్మలారెడ్డి, దక్కత ఢిల్లీరావు, సాలిన ఢిల్లీ, కొండా శంకర్, నందికి జాని, కాళ్ల జయదేవ్, శాసన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్/గార, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ రానుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని రాగోలు, గూడెం, వాకలవలస, లంకాం, ఒప్పంగి, సానివాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గార మండలం అంపోలు, కె.సైరిగాం, సతివాడ, నిజామాబాద్, కొర్ని, కొర్లాం, కొమరవానిపేట గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగలో పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యం

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి గ్రామ స్వరాజ్య సాధనే పల్లె పండగ లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలో బండివీధి, కంబకాయి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కూటమి నాయకులు బలగ ప్రవీణ్, గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, సరియపల్లి మధు, ఎంపీడీవో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్నాం

● ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్/ మందస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం చినంచల, లొద్దభద్ర, రాజగోపాలపురం, మాకన్నపల్లి, మందసలో రోడ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు వజ్జ బాబూరావు, కుత్తుమ లక్ష్మణకుమార్, పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్‌కుమార్, జీకే నాయుడు, భావన దుర్యోధన, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్



శ్రీకాకుళం రూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గ్రామాలకు కొత్తరూపు

● ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం/మెళియాపుట్టి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామాలు కొత్తరూపు దాల్చుకోనున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తామర, తీమర, పాతపట్నంలోని హనుమాన్‌నగర్, మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం, మాకనాపల్లిల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు పైల బాబ్జీ, సతీష్, ప్రసాద్ రామారావు, ఎస్.మోహనరావు, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.



నరసన్నపేట: శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి



పలాసరూరల్: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



పాతపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఆర్థిక సాయం అందజేత

సోంపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మాకన్నపురం గ్రామానికి చెందిన టెంక కోటేష్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.55,632 ఆర్థిక సాయాన్ని మాకన్నపురం స్టూడెంట్స్ ఫోర్స్ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు కలసి ఈ మొత్తం సమకూర్చినట్టు ఫోర్స్ సభ్యులు తెలిపారు. ఈ మొత్తన్ని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

సనాతన ధర్మాన్ని ప్రచారం చేయాలి

పొందూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని విమర్శించడం కొంత మందికి అలవాటుగా మారిందని, సనాతన ధర్మం అంటే ఏమిటో విస్తృతంగా ప్రచారం చేయాల్సి అవశ్యకత ఏర్పడిందని కృష్ణాపురం ఆనందాశ్రమ పీఠాధిపతి, సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసా నంద అన్నారు. కృష్ణాపురంలో ఆనందాశ్రమంలో ఆదివారం నిర్వహించిన సత్సంగ మాధురి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటితరం యువతలో ఆధ్యాత్మిక చింతన పెంచాలన్నారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా ఒత్తిడి అధిగమించవచ్చన్నారు. వందలాది మంది భక్తులు హాజరయ్యారు.

గ్రామస్థుల శ్రమదానం

కవిటి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బల్లిపుట్టుగ పంచాయతీ యల మంచిలి పుట్టుగ గ్రామస్థులు తమ గ్రామానికి వచ్చే రహదారిని ఆదివా రం శ్రమదానం చేసి బాగుచేసు కున్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు మంజూరు కావడంతో గ్రామస్థులంతా కలసి రోడ్డుకిరువైపులా ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేశారు.

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి

లావేరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం బెజ్జిపురం యూత్‌క్లబ్ వద్ద చేపడుతున్న జూట్ వస్తువులను, బుడతవలసలో రైస్ మిల్లు పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్‌హెచ్ నారాయణరావు, ఏపీఎం సుబ్బయ్యనాయుడు, యూత్‌క్లబ్ ప్రతినిధులు జి.అప్పలనాయుడు, ఇజ్జాడ అప్పారావు, నున్నా శ్రీనివాసరావు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జూట్ వస్తువులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

పది ఎకరాల్లో మోడల్‌సాగు

ఆమదాలవలస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విభాగం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సేపేనపేట క్లస్టర్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో పది ఎకరాల్లో ఏ-గ్రేడ్ కాంపాక్ట్ బ్లాక్ మోడల్ సాగును నిర్వహిస్తున్నారు. పంటల సాగు పంటల్లో జీవ వైవిధ్యం ఉండేలా క్షేత్రస్థాయిలో రైతులను అవగాహన పరుస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. రైతులకు అదనపు ఆదాయం చేకూరేలా ఈ పద్ధతిలో పంటల సాగును ప్రోత్సహిస్తున్ననట్టు ఈ సందర్భంగా సిబ్బంది తెలిపారు. కూరగాయలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోందని తెలిపారు. ఈ నూతన విధానంలో సాగుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సైనికులకు కేంద్రమంత్రి భరోసా

అరసవల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు, వీర నారీమణుల ఉన్నతి కోసం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భరోసా ఇచ్చారని మాజీ సైనికుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక పెద్దరెల్లివీధిలో ఉన్న ఫెడరేషన్ కమ్యూనిటీ భవనంలో నెలవారీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారిలో వితంతువులకు విద్యార్హత ఉంటే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఆలోచనలో కేంద్రమంత్రి ఉన్నారని తెలిపారు. అర్హత గలవారు ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు డీఈఎఫ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అమర జవాన్ స్తూపం తలమానికంగా నిర్మిద్దామన్నారు.

రఫీకి శ్రీశ్రీ సాహితీ పురస్కారం

రణస్థలం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం వేమన కవితామయం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన)కు శ్రీశ్రీ కళావేదిక సాహితీ పురస్కారం అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 24 గంటల 24 నిమిషాల 24 సెకన్ల ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో మహ్మద్ రఫీ రాసిన అక్షర కిరణాల కవితకు అందరూ ప్రశంసలు కురిపించారు. అనంతరం శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదగా సన్మానం పొందారు.

రాములు మాస్టారుకు అవార్డు

ఆమదాలవలస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కళా, సాహిత్య అవార్డును పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేపీ రాము లు అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఆదివారం జరిగిన తెలుగు సాహితీ జాతరలో ఈ అవార్డు నిర్వాహకుల నుంచి అందుకున్నారు. నిరంతరాయంగా ఈ నెల 19వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గజల్స్ పాటలు, జానపద గీతాలు, డప్పు, ఫ్లూటు, మౌత్‌ఆర్గాన్ వంటి వాయిద్య పరికరాలతో సుమారు 550 మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తల మధ్య వినూత్న ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. కాగా ఈయన ఐదు ప్రపంచ రికార్డులు తన పేరిట నమోదు చేసుకున్నారు.

సత్యసాయి అవతార దినోత్సవం

ఆమదాలవలస, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవ వేడుకలు మెట్టక్కివలస, వేనంపేట, లక్ష్మపురం, బూర్జ, కురుంపేట, లక్ష్మీనగర్ సాయి సమిత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.



ఆమదాలవలస: సత్యసాయి రథోత్సవం

● శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా నగరంలో సత్యసాయి భక్తులు స్వామి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు.

క్రైం కార్నర్

జల్సాలకు అలవాటు పడి..

- అంతర్ రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్ట్
- ఎనిమిదిన్నర తులాల బంగారం, బైక్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడిన ఓ అంతర్ రాష్ట్ర చైన్ స్నాచర్‌ను ఒకటో పట్టణ పోలీసులు పట్టు కున్నారు. ఆదివారం తన కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 11న తెలుగు ముసలయ్య కాలనీలో నివసిస్తున్న వడ్డి సుజాత తన స్కూటీపై ఖాజీపేట జంక్షన్‌లో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లింది. తిరిగి ఉదయం 9.30 ప్రాంతంలో అరసవల్లి జంక్షన్ వద్దకు వస్తుండగా వెనుక నుంచి ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడు తెంపి పరారయ్యాడు. దీనిపై బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే సాంకేతికత ఆధా రంగా నిందితుడ్ని విశాఖపట్నంలోని కంచపాలెం సుభాష్ నగర్‌కు చెందిన భీమర శెట్టి కమలనాథ్‌గా గుర్తించారు. ఈనెల 19న శ్రీకాకుళంలోని తోటపాలెం రోడ్డులోని షిర్డీసాయి ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతడిని ఎస్ఐ హరికృష్ణ, క్రైం సిబ్బంది పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడన్నారు. నిందితుడు ఈనెల 11న అరసవల్లిలో దొంగతనం చేసి, విజయనగరం జిల్లా డెంకాడలో రెండు న్నర తులాల బంగారు ఆభరణం, ఈస్ట్ గోదావరి జిల్లా జగ్గం పేట గ్రామంలో ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు చోరీ చేసి ముత్తూట్ ఫైనాన్స్‌లో తండ్రి పేరిట తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సా చేశాడని తెలిపారు. గతేడాది డిసెంబరు 23 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జైలుశిక్ష అనుభవించాడని, బయటకు వచ్చిన తర్వాత మరలా వరుస దొంగతనాలకు పాల్పడ్డాడని డీఎస్పీ తెలిపారు. ఇతడిపై ఇతర రాష్ట్రాల్లోనూ 30కి పైగా కేసులు ఉన్నాయని చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణతో పాటు కీలక సమాచారం సేకరించిన క్రైం సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ వివేకానంద ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

చైన్ స్నాచర్లపై సస్పెక్ట్ షీట్

జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఎస్పీ ఆధ్వర్యంలో ఛేదించామని, ఈ కేసుల్లో పట్టుబడ్డ వారిపై సస్పెక్ట్ షీట్ తెరుస్తున్నామని డీఎస్పీ వివేకానంద వివరించారు. నేరస్థులపై నిఘా ఉంచి నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు. ఇకపై నేరాలకు పాల్పడిన వారు జైలు నుంచి విడుదల కాగానే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

నందిగాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. ఈ ఘటనకు కారణమైన టి.భువనేశ్వరరావును అరెస్టు చేసి టెక్కలి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నందిగాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరు సమీపంలో హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పలాస మండలం గోపాలపురానికి చెందిన సామ కామయ్య, కేశవరావు కామధేనువు ఫంక్షన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా కాపు తెంబూరు జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వీరిని ఆసుపత్రిలో టెక్కలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై పోలీసుల వద్ద ప్రస్తావించగా ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

చోరీ సొత్తు రికవరీ


మాట్లాడుతున్న సీఐ మంగరాజు

సోంపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సోంపేట, మందస పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు సంబంధించి రూ.2.05 లక్షలు విలువైన సుమారు 122 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి.హైమావతితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని చిన్నకోమటి వీధికి చెందిన కోల కిరణ్ అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు. ఈ క్రమంలో తాళాలు ఎలా పగలగొట్టాలో యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్నట్టు విచారణలో తేలింద న్నారు. ఈనెల 5న మందస మండలం కొత్తపల్లి రోడ్డుపై ఉన్న ఒక దాబా ఇంటి తాళాలు విరగొట్టి లోపల వస్తువులు ఏమీ లేకపోవడంతో సోంపేటలో తాను నివాసం ఉంటున్న చిన్నకోమటి వీధిలో కొంచాడ అర్చన ఇంట్లో చోరీకి పాల్పడినట్టు తెలిపారు. అలాగే 10వ తేదీన మందస మండలం సొండిపూడిలో ఎదురెదురుగా తాళాలు వేసి ఉన్న రెండిళ్ల తాళాలు విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడు కోల కిరణ్ నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ హైమావతి, హెచ్‌సీ గవరయ్య, సిబ్బంది నీలకంఠం, ప్రసాద్, షన్ముఖను ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు అభినందించారన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాళింగ మన్నయ్యపేట గ్రామానికి చెందిన పైడి తేజేశ్వరరావు అనే 15ఏళ్ల బాలుడు కనబడటం లేదని అతడి తండ్రి పోలినాయుడు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 16న ఉదయం 8గంటల ప్రాంతంలో ఇంటి నుంచి చింతాడలో స్కూల్‌కి వెళ్లిన తేజేశ్వరరావు తిరిగి ఇంటికి రాకపోవడంతో గ్రామం, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణపై కేసు నమోదు

జలుమూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ మాకివలస గ్రామంలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. ఆయన పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.. ఎస్టీ మాకివలస గిరిజనులకు, హరేరామ హరేకృష్ణ సభ్యులకు మధ్య కొంతకాలంగా భూ వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో గిరిజనులు పండించిన పంటలను మేము కొనుగోలు చేసిన స్థలంలో నూర్పిడి చేయడం ఏమిటని హరేకృష్ణ సభ్యులు శనివారం రాత్రి గ్రామానికి వెళ్లి గిరిజనులను అడ్డుకున్నారు. దీంతో గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేసి మాపై దాడి చేసి గాయపరిచారని, మా కారుపై రాళ్లు వేసి ధ్వంసం చేశారని హిరమండలం మండలం కూర్మ గ్రామానికి చెందిన బానూరి రాజు ఫిర్యాదు చేశారన్నారు. తరతరాలుగా హక్కు అనుభవంలో ఉన్న భూముల్లో పండించిన పంటలను నూర్పిడి చేస్తుంటే కూర్మ గ్రామానికి చెందిన హరేకృష్ణ సభ్యులు రాత్రివేళ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించి మా పనులకు ఆటంకం కలిగించి, కులం పేరుతో దూషించి దాడులకు పాల్పడ్డారని గిరిజనులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కులం పేరుతో దూషించిన హరేకృష్ణ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థినితోపాటు మరొకరు మృతి
- మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ డ్రైవర్
- పోలాకి మండలం జిల్లేడువలసలో విషాదఛాయలు


ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నరసన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో సత్యవరం జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం జిల్లేడువలసకి చెందిన నక్క రామారావు(48), తియ్యాల భవ్య (16) అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం సంభవించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నక్క రామారావు, తియ్యాల భవ్య బైక్‌పై శ్రీకాకుళం రూరల్ మండలం పరదేశిపాలెం బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో నరసన్నపేట బైపాస్ రోడ్డులో వెళ్తున్న సమయంలో శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న నక్క రామారావు తుళ్లిపోయి సర్వీసు రోడ్డు పక్కన పడగా, లారీ ద్విచక్రవాహనంతో పాటు, భవ్య మృతదేహాన్ని కొంతవరకు ఈడ్చుకెళ్లిపోయింది. దీంతో భవ్య మృతదేహం ఛిద్రంగా మారింది. రామారావు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు సపర్యలు చేసినప్పటికీ అప్పటికే రెండు కాళ్లు విరిగిపోవడం, తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ తప్పించుకునేందుకు ప్రయత్నించగా వెనుక వైపు నుంచి వచ్చిన వాహనాలు అడ్డుకోవడం తో లారీని డ్రైవర్ నిలిపాడు. విషయం తెలుసుకున్న నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్, ఏఎస్ఐ అసిరినాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఘటనను చూసిన వారు కంటతడిపెట్టారు. లారీ డ్రైవర్ మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మృతదేహాలను నరసన్నపేట మార్చురీకి తరలించారు. మృతురాలు భవ్య నరసన్నపేటలో ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. రామారావు వ్యవసాయం చేస్తున్నారు.

ఐదు నిమిషాల్లో ఇంటికి వెళ్లాల్సి ఉండగా..

సంఘటన జరిగిన ప్రదేశం నుంచి ఐదు నిమిషాలు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తే ఇళ్లకు వెళ్లాల్సిన వీరిని లారీ రూపంలో మృత్యువు కబళించడం అక్కడి వారిని కలిచివేసింది. పక్కంటి బంధువుల పెళ్లికి వెళ్తారని తన కుమారుడు సంతోష్‌కు చెప్పి ద్విచక్రవాహనం అడిగి రామారావు గ్రామం నుంచి సింగల్‌గా పరదేశిపాలెం పెళ్లికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న సమయంలో తియ్యాల భవ్య తల్లిదండ్రులు నరసమ్మ, గవిరేసులు అమ్మా.. పరీక్షలు అంటున్నావు.. వెళ్లిపోతానంటున్నావ్.. అంకుల్ రామారావు బండిపై ఇంటికి వెళ్లు. బాగా చదువుకో అని పంపించారు. కానీ విధివంచనలో ఈ విధంగా ప్రమాదానికి గురై ఇద్దరు బలి అయిపోవడంతో బంధువులు రోదిస్తున్నారు.

నాన్నా.. అమ్మ నీకోసం చూస్తోంది

సంఘటన వద్ద మృతుడు రామారావు కుమారుడు సంతోష్ తండ్రి మృతదేహాన్ని చూసి నాన్న కళ్లు తెరిచి ఉన్నారు.. ఆసుపత్రికి తీసుకువెళ్లండి.. లెగు నాన్నా.. నీ కోసం అమ్మ ఇంటి వద్ద చూస్తోందని అన్న మాటలు అక్కడ ఉన్న వారి కంట తడిపెట్టించాయి. చూడండి.. మానాన్న గుండె కొడుతోందని పోలీసులకు చెప్పి ఆసుపత్రికి తీసుకువెళ్లండని పదే పదే సంతోష్ తన తండ్రి గుండెపై పడిన దృశ్యం చూపరులను ఆందోళనకు గురిచేసింది.

గ్రామంలో విషాదఛాయలు

పోలాకి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన రామారావు, భవ్యల స్వగ్రామం జిల్లేడువలసలో విషాదఛాయలు అలముకున్నాయి. నక్క రామారావు, తియ్యాల భవ్యలది పక్క పక్క ఇళ్లు.. రామారావు మృతిచెందినట్లు తెలియడంతో భార్య ముత్యాలమ్మ, కుమార్తె తేజస్విని, కుమారుడు సంతోష్ కన్నీరుమున్నీరయ్యారు. భవ్య తల్లిదండ్రులు ప్రమాదం జరిగినప్పటికే పరదేశిపాలెం పెళ్లిలో ఉన్నారు. కుమార్తె మృతిచెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గవిరేసు, నరసమ్మ, సోదరుడు లోకేష్‌తో పాటు బంధువులు నరసన్నపేట ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కుమార్తె ముఖం చూపించాలని తల్లిదండ్రులు అక్కడి వారిని వేడుకున్నారు.

వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించాలి

హరిపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సంక్షోభాన్ని గట్టెక్కించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ ఆర్థిక నిపుణుడు కన్నిగంటి రవి అన్నారు. హరిపురంలో ఆదివారం రైతాంగ సమస్యలు-నివారణ చర్యలపై సదస్సు నిర్వహించారు. పలాస డివిజన్‌లో అపారమైన నీటి వనరులున్నా శాశ్వత వనరులు కరవై కనీసం పంట చేతికొచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార కాలువను బొడ్డపాడు వేపాడు చెరువుమీదుగా, సంకుజోడి, జంతిబంద, దామోదర సాగర్, గోపాలసాగర్‌లకు అనుసంధానం చేయాలన్నారు. తితిలీ పరిహారం అందని వేలాది మంది రైతులు సర్వం కోల్పోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణారావు. వీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపూర్ణ, రైతు సంఘం ప్రతినిధులు జెన్న కామేశ్వరరావు, ముడిమంచి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం

పాతపట్నం. అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమై వీధుల గుండా వర్షపు నీరు ప్రవహించింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలవ్యాప్తంగా అత్యధి కంగా వరి సాగులో ఎదలు వేశారు. ఇప్పటికే పలుచోట్ల నదీ పరీవాహక ప్రాంతాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. దీనికి కొంతమేర ఆటంకం ఏర్పడింది.

తెప్పలకు శ్రీశ్రీ కళా పురస్కారం

పలాసరూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాన కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన శ్రీశ్రీ కళావేదిక 140వ కళాజాతలో పలాస జనజాగృతి సాహితీసంస్థ గౌరవాధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి పురస్కారం అందించారు. ఈయన 'తరగని ఆస్తులు-మన సంప్రదాయాలు' పై కవితా గానం చేసి ప్రశంసలు అందుకున్నారు. వేదిక చైర్మన్ కె.ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణ్ సత్కరించారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.71 లక్షలు

అరసవల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.3,71,810 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,20,600, విరాళాల రూపంలో రూ.83,715, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,67,495 ఆదాయం లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

నాలుగు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోగల పలు వార్డుల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, మరమ్మతులు చేపట్టనుండడంతో నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పలాస విద్యుత్ ఈఈ యోగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 నుంచి 24 వరకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గోర్జివీధి, కార్జీవీధి, హాస్పటల్ రోడ్, ఉప్పలవీధి, మంగళవారంపేట, రథం వీధి, పంజావీధి జంక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

లావేరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లావేరు గ్రంథాలయంలో విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలను పఠనం చేపట్టారు. సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులు పాఠశాలలో తరగతి పుస్తకాలను చదువుతున్నారని చెప్పారు. ఆదివారం గ్రంథాలయానికి వచ్చి బాలసాహిత్యంతో పాటు వివిధ రకాల పుస్తకాలు చదువుకోవాలన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం పెంపొందించుకోవాలి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం పెంపొందిం చుకోవాలని బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లోనూ పాల్గొని ప్రతిభ కనబరచాలని కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పాఠ్యాంశ బోధన పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అక్కుపల్లి పాఠశాల భవనాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జ్వరాలతో వణుకుతున్న ఆదీఆంధ్రావీధి

టెక్కలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆదీఆంధ్రావీధిలో స్థానికులు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఏ ఇంటిలో చూసిన జ్వరపీడితులే కనిపిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సైతం చికిత్స పొందుతున్న వారిలో ఎక్కువగా ఈ వీధికి చెందిన వారే ఉన్నారు. పలువురు ఇళ్ల వద్దే ఆర్ఎంపీలతో చికిత్సలు చేయించుకుంటున్నారు. ఆదీ ఆంధ్రావీధిలో పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలుతున్నట్లు స్థానికులుచెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వంశధారలో తగ్గిన ఇన్‌ఫ్లో


గొట్టాబ్యారేజి తగ్గిన నీటి మట్టం

హిరమండలం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు లేకపోవడంతో వంశధార నదిలో ఇన్‌ఫ్లో తక్కువగా వస్తుండడంతో గొట్టాబ్యారేజి వద్ద నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. దీంతో కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటి విడుదల కష్టంగా మారింది. బ్యారేజి వద్ద నీటి నిల్వ తగ్గిపోతుండడంతో రెండు ప్రధాన కాలువల ద్వారా సాగునీటిని పూర్తి స్థాయిలో అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రెండు రోజుల క్రితం కుడి కాలువ హెడ్ రెగ్యు లేటర్ గేట్లు మూసివేశారు. రిజర్వాయర్‌లో కేవలం 2.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండడంతో కుడి కాలువకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శివారు భూములకు సాగునీరు అందాలంటే కాలువ ద్వారా 700 క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేయాల్సి ఉంది. గొట్టా బ్యారేజి నుంచి సాగునీటి విడుదల చేసే కుడి కాలువ గేట్లు మూసివేసి ఎడమ కాలువ ద్వారా 1230 క్యూసెక్కులను విడిచి పెడుతున్నారు. శివారు భూములకు సాగునీరందాలంటే కనీసం 1800 క్యూసెక్కులు ప్రవహించాల్సి ఉంది. ఆదివారం సాయంత్రానికి నదిలో 1230 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా వచ్చిన నీటిని కాలువలోకి పంపిస్తున్నారు. బ్యారేజి వద్ద నీటి మట్టం 37.28 మీటర్లు ఉంది. మరో రెండు రోజుల్లో అల్పపీడన ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడతాయని వాతావరణశాఖ సమాచారంతో నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని వంశధార అధికారులు చెబుతున్నారు. అల్పపీడన ప్రభావం లేకపోతే ఖరీఫ్ చివరి వరకు నీటిని విడుదల కష్టమేనని చెబుతున్నారు.

సంయమనం పాటించండి

జలుమూరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ మాకివలస గ్రామస్థులు, హరేరామ హరేకృష్ణ సభ్యులు సంయమనం పాటించి సహకరించాలని ఇరువర్గాలకు న్యాయం చేస్తామని తహసీల్దార్ జె.రామారావు, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. మాకివలస గ్రామంలో శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అధికారులు ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాలతో వేర్వేరుగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేసినందున ఎవ రూ ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ సమస్యపై ఉన్నతాధికారులు ఎవరికి హక్కులున్నాయో రికార్డులను పరిశీలించి ప్రకటి స్తారని, అంతవరకు ఎటువంటి కవ్వింపు చర్యలు పాల్పడవద్దన్నా రు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు, డీటీ మధుబాబు, ఆర్ఐ కిరణ్, గ్రామస్థులు, హరేకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు, పోలీసులు

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఎస్టీ మాకివలస గిరిజనులపై దాడిచేసి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించిన హరేరామ హరేకృష్ణ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీ మాకివలస గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన గ్రామంపై రాత్రి సమయంలో దాడిచేసి బెదిరించిన హరేరావ సభ్యులపై హత్యానేరం కేసు నమోదు చేయాలన్నారు. ఈ భూ వివాదాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని, అధికారులు పరిష్కారమార్గంపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయినప్పటికీ హరేరామ హరేకృష్ణ సభ్యులు గిరిజన గ్రామంపై దాడిచేయడం అన్యాయమన్నారు.

ఎర్రన్నాయుడు వర్ధంతి



టెక్కలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిమ్మాడలోని కింజరాపు నివాసంలో దివంగత నేత ఎర్రన్నాయుడు వర్ధంతిని తిథుల ప్రకారం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సోదరులు హరిప్రసాద్, కింజరాపు ప్రభాకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమం నిర్వహిస్తున్న అచ్చెన్న సోదరులు

న్యూస్ బాక్స్

అన్నక్యాంటీన్‌కు విరాళం

కోటబొమ్మాళి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు శ్రీకాకుళం జిల్లా ఎన్టీ ఆర్, మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షుడు మాదారపు డేవిడ్ రూ.20 వేలు నగదును ఆదివారం అందించారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఈ మొత్తం అందజేశారు. కార్యక్ర మంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణం

మెళియాపుట్టి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరు చేసి భవనాల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు తెలిపారు. ఆదివారం నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిం చారు. కార్యక్రమంలో సీడీపీవో విమలారాణి, సూపర్ వైజర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫొటో చించివేయడం తగదు

నందిగాం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరులో స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌లోని సీఎం చంద్రబాబు నాయుడు ఫొటోను చించివేయడం తగదని టీడీపీ యువ నాయకుడు కొల్లి హరిబాబు అన్నారు. స్థానిక బీసీ కాలనీ సామాజిక వేదిక వద్ద సచివాలయ సిబ్బంది, ఇతరుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను అతికించగా దానిపై ఉన్న ఫొటోను ఆకతాయిలు చించివేశారని, ఇటువంటివి పునరావృతం కాకుండా, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యువత రక్తదానం

నరసన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బొరిగివలస గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్, కలాంనంద వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 41 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి. రాంబాబు, గొల్లంగి ముఖలింగం, కోటపల్లి జగదీష్, కుంచి నరేంద్ర పాల్గొన్నారు.

మానవ హక్కుల కోసం సాయిబాబా పోరాటం

నరసన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో మానవహక్కుల కోసం పోరాటం చేసి ప్రజా గొంతుకగా ప్రొఫెసర్ సాయిబాబా నిలిచారని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు అన్నారు. ఆదివారం కోమర్తి కాలనీలో ప్రొఫెసర్ సాయిబాబు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నేతలు ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసి జైలు జీవితాన్ని అనభవించిన సాయిబాబా మృతి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.దాలినాయుడు, కొల్లి రాజులు, అలుగు వాసుదేవరావు, మురకాడ అప్పన్న, పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ షెల్టర్లలో మెరుగైన వసతులు

ఎచ్చెర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో నేపథ్యంలో తుఫాన్ షెల్టర్లలో మెరుగైన వసతులు కల్పించనున్నట్టు డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.సుధాకరరావు తెలిపారు. బొంతల కోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెంలో తుఫాన్ షెల్టర్ భవనాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. అత్యవసర సమయాల్లో ఈ భవనాల్లో ప్రజలు ఉండేలా అనువైన వాతావరణాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇతర ప్రభుత్వ భవనాల్లో ప్రజలకు ఆశ్రయం కల్పించేలా సిద్ధం చేయాలన్నారు. పునరావాస చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.